క్లుప్తంగా

పేదలకు అన్నదానం



నెల్లూరు(బృందావనం) : పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో క్రాంతి మహిళా మండలి ఆధ్వర్యంలో దివ్యాంగులు, పేదలు, వృద్ధులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి, భీమిరెడ్డి రమణమ్మ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ జి.పవిత్ర ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టామన్నారు. అనంతరం బాబాసాహెబ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈదూరు గోపినాథ్‌రెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, ఆర్వీ కృష్ణారెడ్డి, సీహెచ్.మమతారెడ్డి, శారదమ్మ, తంబయ్య నాయుడు, బి.రాజగోపాలరెడ్డి, దగ్గుపాటి రాధాకృష్ణ, మాజీ కార్పొరేటర్ పి.పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ : రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం స్వాతి నక్షత్రం సందర్భంగా మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. స్నపన తిరుమంజనం, తిరుప్పావడ సేవ కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ గోపి, అర్చకులు భాస్కరాచార్యులు, కృష్ణమా చార్యులు, అప్పలాచార్యులు, రాఘవాచార్యులు, మురళీధరాచార్యులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతాంగానికి తీవ్ర నష్టం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య ఆరోపించారు. నగరంలోని సంతపేటలో ఉన్న రామకోటయ్య భవన్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అఖిలభారత కిసాన్‌సభ మహాసభలు తమిళనాడులోని నాగపట్నంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరుగనున్నాయని తెలిపారు. రైతులు తరలిరావాలని కోరారు. నరేంద్రప్రసాద్, కోటారెడ్డి, శ్రీనివాసులు, షాన్‌వాజ్ పాల్గొన్నారు.

జయభారత్‌లో రక్తదాన శిబిరం



నెల్లూరు(అర్బన్) : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో సింహపురి సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ్ చాలక్ డాక్టర్ బీఎస్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. సింహపురి వైద్యసేవా సమితి కోశాధికారి గుర్రం సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోలయ్య, భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జేపీ జైన్, ఆస్పత్రి డిప్యూటీ మేనేజర్స్ వెంకటేష్, కృష్ణారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

20 కిలోల కేన్సర్ గడ్డ తొలగింపు

• పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ చేసి గడ్డను తొలగిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఓ మహిళకు 20 కిలోల కేన్సర్ గడ్డను శస్త్రచికిత్స చేసి విజయవంతంగా తొలగించామని సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వరుణ్ ప్రకాష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం వివరించారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన 44 ఏళ్ల చారమ్మ అనే మహిళ కడుపునొప్పితో బాధపడుతుండేదన్నారు. ఆమె నాటు మందులు వాడుతూ గడ్డను పెంచుకుందన్నారు. ఈనెల 7న పెద్దాస్పత్రికి రాగా అన్నిరకాల పరీక్షలు చేసి అత్యవసరంగా సర్జరీ చేశామన్నారు. సుమారు 20 కిలోల గడ్డను తొలగించామన్నారు. అప్పటి నుంచి వైద్యం చేయగా ఇప్పుడు కోలుకుందన్నారు. ఆపరేషన్‌లో డాక్టర్లు స్నిగ్ధ, మాధురి, గైనకాలజి ప్రొఫెసర్ ఇందిరలతో పాటు అనస్థీషియా టీమ్ మధుప్రియ, లోకేష్, హెచ్‌ఓడీ డాక్టర్ ఎంఎస్‌రావుల బృందం ఆపరేషన్‌ను విజయవంతం చేశారన్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం



వైభవంగా సాగుతున్న వేణుగోపాలుడి రథోత్సవం

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని వేణుగోపాలస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉభయదేవేరులతో సర్వాలంకార శోభితంగా కొలువైన వేణుగోపాలుడిని భక్తులు దర్శించుకున్నారు. రథోత్సవం మూలాపేట మెయిన్ రోడ్డు, బ్రాహ్మణవీధి, ఈఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాల, పొట్టిశ్రీరాములు సెంటర్, వేదసంస్కృత పాఠశాల, అలంకార్‌సెంటర్, రాజాగారివీధి, రావిచెట్ల సెంటర్ మీదుగా దేవస్థానానికి చేరింది. రథోత్సవం ఉభయకర్తలుగా పేటేటి రాఘవరావు దంపతులు వ్యవహరించారు. రాత్రి పుష్పక విమాన అలంకారోత్సవంలో స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా సాగిరాజు వెంకటరాజు– సునీత దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కాగా రథోత్సవం సందర్భంగా భక్త బృందం, రథచక్రాల నియంత్రణకు చొప్పవేసే వారి మధ్య సమన్వయ లోపం ఏర్పడింది. దీనివల్ల బ్రాహ్మణవీధి మలుపువద్ద రథం అదుపుతప్పింది. రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు దూసుకెళ్లింది. అయితే రథంలాగే వారు క్షణకాలంలో రథాన్ని నియంత్రించడంతో ప్రమాదం త్రుటిలో తప్పింది.

మల్లేశ్వరస్వామికి..

నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రధానార్చకుడు కార్తీకేయశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి రథంపై స్వామివారిని కొలువుదీర్చారు. రథోత్సవం నవాబుపేట మెయిన్‌రోడ్డు, కొలిమివీధి, మంగలివీధి, తడికల బజారు సెంటర్, పప్పులవీధిలోని వినాయక స్వామి మందిరం వరకు సాగింది. ఈఓ బి.మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

కోదండరామస్వామికి..

ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోదండరాముని రథోత్సవం సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. నయనానందకరంగా తీర్చిదిద్దిన రథంపై సీతాలక్ష్మణ హనుమంత సమేత కోదండరామస్వామి సర్వాలంకార శోభితంగా కొలువై భక్తులను అనుగ్రహించారు. రథోత్సవం శ్రీరంగరాజపురం, రేబాలవారివీధి, స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు మీదుగా తడికల బజారు సెంటర్‌కు అక్కడి నుంచి స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు మీదుగా సాగింది. అనంతరం ఎదుర్కోలు ఉత్సవం వేడుకగా సాగింది. రథోత్సవం ఉభయకర్తలుగా వంక కైలాసపతి, శ్రీహరిప్రసాద్‌రావు, ప్రభాకర్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. రాత్రి తిరిచి ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చుండూరు జగన్‌మోహన్‌రావు వ్యవహరించారు. ఈఓ జి.దుర్గయ్య పర్యవేక్షించారు.



వేడుకగా సాగుతున్న మల్లేశ్వరుని రథోత్సవం

అంబేడ్కర్ సేవలు మరువలేనివి







అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఆర్థిక అసమానతలను రూపుమాపి సమసమాజ స్థాపన కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని కలెక్టర్ ఆనంద్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో బాబాసాహెబ్ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, మేయర్ స్రవంతి, జేసీ కార్తీక్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పలువురు ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

➡ వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

➡ అంబేడ్కర్‌పై ఫిజిక్స్ అధ్యాపకుడు చైతన్య విద్యాసాగర్ రచించి, స్వరకల్పన చేసి, చిత్రీకరించిన వీడియోను కాంగ్రెస్ నాయకులు ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి, సంజయ్ ఆవిష్కరించారు.

➡ నగరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఆర్గనైజర్స్ హరీష్ కుమార్, పి.రామచంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఎస్ఈ శరత్‌కుమార్, ఈఈ శ్రీనివాసులు, సౌత్‌కోస్టల్ ప్రెసిడెంట్ డి.శ్రీనివాసులు, డీఈఈ పద్మావతి పాల్గొన్నారు.

➡ వీఆర్సీ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ వ్యవస్థాపకుడు గడ్డం అనోక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి జాషువా, ఆర్గనైజింగ్ సెక్రటరీ సునీల్ గవాస్కర్‌లు నివాళులర్పించారు.

➡ ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, నాయకులు బలరామ నాయుడు, హరిబాబు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రామ్మోహన్‌రెడ్డి, మస్తాన్‌బాషా పాల్గొన్నారు. అలాగే వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు చింతల అమరేంద్ర రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, స్వర్ణ రమేష్‌బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

➡ నెల్లూరు(అర్బన్) : నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్ఓ సుజాతతో పాటు పలువురు డాక్టర్లు, వైద్యసిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంఓ రమేష్, డాక్టర్ భాస్కర్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ దివ్య, డెమో అధికారి కనకరత్నం, ఏఓ నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

➡ స్థానిక మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పాస్టిక్ సెంటర్‌లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్, జిల్లా సెక్రటరీ మస్తానయ్య, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు పాల్గొన్నారు.

➡ దర్గామిట్టలోని ఏపీఎన్జీఓ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కాకుల పెంచలయ్య, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, ఉపాధ్యక్షురాలు కరుణమ్మ, రాజేంద్రప్రసాద్, కృష్ణకుమార్, రామకృష్ణారెడ్డి, మార్కండేయులు, మహిళా చైర్‌పర్సన్ చిన్నమ్మ, నవోదయ, స్వర్ణలత పాల్గొన్నారు.

➡ నగరంలోని సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో భీమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు మనోజ్, ఆస్పత్రి కార్మికులు పాల్గొన్నారు.

➡ నెల్లూరురూరల్ : అంబేడ్కర్ జయంతిని కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో సోమవారం నిర్వహించారు. డీఆర్వో ఉదయభాస్కర్, ఏఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

➡ స్థానిక వీఆర్సీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే కబాడిపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ నివాళులర్పించారు.

➡ నెల్లూరు (లీగల్) : జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని, అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్‌రెడ్డి, సుందరయ్య యాదవ్, విజయకుమార్‌రెడ్డి, కుడుముల రవికుమార్, జల్లి పద్మాకర్, రంగారావు, భానురామన్, స్వర్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

➡ నెల్లూరు(క్రైమ్):జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరిపారు. ఏఎస్పీ సౌజన్యతో పాటు పలువురు పోలీసులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వెల్ఫేర్ ఆర్ఐ అంకమరావు, ఎలక్షన్ సెల్ ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

➡ బీవీ నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, డీపీఈఓ శ్రీనివాసనాయుడు, ఏఈఎస్‌లు రమేష్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

➡ నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలో జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, సహాయ అధికారి వేణుగోపాలరావు, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

➡ వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తన సొంత నిధులతో శిల్పశాల మధు ద్వారా అంబేడ్కర్ విగ్రహాన్ని తయారు చేయించి ఏకే నగర్ పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేశారు.

➡ నెల్లూరు సిటీ : నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి నివాళులర్పించారు. అలాగే 12వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి విజయకుమార్‌రెడ్డి పూలమాల వేసి, కేక్ కటింగ్ చేశారు.

➡ నెల్లూరు (టౌన్) : స్థానిక వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రాష్ట్ర ఈసీ కమిటీ సభ్యుడు రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, నాయకులు జుల్ఫీకర్‌అలీ, మురళీకృష్ణ పాల్గొన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, కమిటీ సభ్యులు విక్రమ్, వర్ధన్ బాబి, యశ్వంత్, సుమంత్, భరత్ పాల్గొన్నారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ నరేంద్రబాబు పాల్గొన్నారు.

➡ స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి నరసింహ, సీపీఐ సీనియర్ నాయకులు రామరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, నాయకులు రాజమనోహర్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

➡ స్థానిక జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

➡ నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి మేయర్ స్రవంతి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత వీఆర్సీ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, అదనపు కమిషనర్ నందర్, మేనేజర్ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

➡ సుబేదారుపేటలో ఉన్న మెప్మా కార్యాలయంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఐబీ అంకయ్య, బీఎల్ హర్షిత పాల్గొన్నారు.

➡ వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి జనతా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్, న్యాయసలహా కార్యదర్శి నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

➡ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బట్వాడిపాళెం సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మందా బాబ్జి, కూడి ఆనంద్, ఏవీ రమణయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని విద్యుత్‌భవన్‌లో ఎస్ఈ విజయన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈఈ శ్రీధర్ పాల్గొన్నారు.

➡ వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు తిరుపతి, జగదీష్, శేఖర్, సురేంద్ర పాల్గొన్నారు.

➡ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నగరాధ్యక్షుడు నారపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వీఆర్సీ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

➡ బుజబుజ నెల్లూరులో సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

➡ వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

➡ నగరంలోని డీసీఓ కార్యాలయంలో సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీలత, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో..



రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో..



నివాళులర్పిస్తున్న మేయర్ స్రవంతి



న్యాయవాదుల ఆధ్వర్యంలో..



జిల్లా పోలీస్ కార్యాలయంలో..



చింతారెడ్డిపాళెంలో కేక్ కటింగ్



ఎస్టీయూ ఆధ్వర్యంలో..



విద్యుత్ భవన్‌లో..



సమగ్రశిక్ష కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

సమాజ సేవకులను ప్రోత్సహించాలి



వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం) : సమాజంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించాలని గ్లోబల్ పీస్ సమ్మిట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ మధుకృష్ణన్ తెలిపారు. నగరంలోని క్రాంతినగర్‌లో ఉన్న ఓ హోటల్‌లో సోమవారం డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, గ్లోబల్‌పీస్ సమ్మిట్ ఆధ్వర్యంలో పలువురికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తున్న వారికి గుర్తింపు ఇవ్వాలన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్, ధనుంజయ రెడ్డి, టైటస్ నిర్మల్‌కుమార్, జయప్రకాష్ పాల్గొన్నారు.

➡ నెల్లూరు(అర్బన్) : పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గ్లోబల్ పీస్ సమ్మిట్ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. దర్గామిట్టలోని ఓ హోటల్‌లో కొండూరు హరినారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో దీనిని స్వీకరించారు.

➡ నెల్లూరు(బృందావనం) : వాణిజ్య, సేవా రంగాల్లో సేవలందిస్తున్న నిర్మల ఏజెన్సీస్‌కు గోల్డెన్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించిందని సంస్థ అధినేత నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో దీనిని అందుకున్నారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరానికి చెందిన కూచిపూడి డ్యాన్సర్ చెన్నారెడ్డి శరణ్యారెడ్డి గ్లోబల్ పీస్ సమ్మిట్ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.

బాల్య వివాహాలకు పాల్పడితే శిక్షలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

నెల్లూరు సిటీ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, సమాజంలో ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఏఎస్సై శ్రీహరి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని ఆమంచర్ల గ్రామ ఎస్టీ కాలనీలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు, సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ బాలికల భద్రత, మహిళల రక్షణే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తోందన్నారు. సిబ్బంది సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నెల్లూరు(బృందావనం) : కేరళ ఉగాది సందర్భంగా వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత విషుక్కణి దర్శనం కల్పించారు. భక్తులకు గర్భాలయం నుంచి మేల్‌శాంతి చిల్లర నాణెములను అందజేశారు. గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, పీటీ జగన్నాథం, కేజీ శంకరన్, కె.మోహన్‌రావు, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

దూషణపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : ఎక్స్ వేదికగా రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అతని తల్లిదండ్రులను దూషిస్తూ పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్ సోమవారం రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం తెలిపారు. హరనాథపురంలోని అన్ని వీధులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.

నగరంలో బిస్ సమావేశం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఇస్కాన్‌సిటీలో ఎమ్మెస్సార్ గెస్ట్‌ఇన్‌లో బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి (బిస్) సర్వసభ్య సమావేశం, వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, వైద్యుడు పోకల రవి పాల్గొని, మాట్లాడారు. సమితి అధ్యక్షుడు అనిల్‌కుమార్, కోశాధికారి మల్లికార్జున, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రసన్నకు కొండ్రెడ్డి అభినందన



ప్రసన్నకు అభినందనలు తెలుపుతున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, ఏసునాయుడు, నాగ శ్రీనివాసులురెడ్డి, షేక్.మొహిద్దీన్, బెల్లంకొండ వెంకయ్య, నగేష్, లాలం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనం దంపతులతో ఎంపీ భేటీ



నెల్లూరు సిటీ : జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిలను చింతారెడ్డిపాళెంలోని వారి నివాసంలో తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించాలని అడిగినందుకు దాడి

నెల్లూరు సిటీ : తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని అడిగినందుకు తనపై దాడి చేశారని ఓ మహిళ సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. రూరల్‌లోని సాదావారిపాళెంలో అరుణ సమీపంలోని కల్యాణ్ అనే వ్యక్తికి కొంతకాలం క్రితం రూ.4 లక్షలను అప్పుగా ఇచ్చింది. ఈ క్రమంలో తనకు డబ్బులు అవసరమని, ఇచ్చిన అప్పును తిరిగి ఇవ్వాలని కల్యాణ్‌ను కోరింది. దీంతో మాటామాటా పెరిగి కల్యాణ్, అతని భార్య, అత్త కలిసి అరుణపై దాడి చేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.